క్లుప్తంగా

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం నేడు

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): అనిగండ్లపాడులో గురువారం ఉదయం 10 గంటలకు పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను ప్రారంభిస్తారని సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన రెండు రైతుభరోసా కేంద్రాలు, సీసీ రోడ్డు, సహకార సంఘ గోడౌన్‌ను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని వివరించారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని వారు కోరారు.

రేపు వైఎస్సార్‌సీపీ సమావేశం

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశం శుక్రవారం ఉదయం పదిగంటలకు కోదాడ రోడ్‌లోని బి కన్వెన్షన్‌లో జరుగుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ముఖ్య అతిథులుగా ప్రభుత్వవిప్ ఉదయభాను, రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వెలంపల్లి శ్రీనివాసరావు, నియోజకవర్గ పరిశీలకుడు నూతలపాటి హనుమయ్య పాల్గొననున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు పెద్దసంఖ్యలో పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ ప్రకటనలో కోరారు.

డొంకరోడ్డు అభివృద్ధి పనుల ప్రారంభం



నందిగామ: మండలంలోని మాగల్లులో డొంక రోడ్డు అభివృద్ధి పనులకు కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ బుధవారం ప్రారంభించారు. మండల పరిషత్ అభివృద్ధి నిధులు రూ.4 లక్షలతో గ్రామంలోని గోపువాని డొంక అభివృద్ధితోపాటు కంపచెట్ల తొలగింపు పనులను ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ గుంటి ఆశాజ్యోతి, ఎంపీటీసీ సభ్యురాలు కె.శోభారాణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైద్య పరికరాలు బహూకరణ



నరసింహారావుపాలెం(వీరులపాడు): గ్రామాభివృద్ధికి కర్మాగారాల యాజమాన్యాలు సహకరించాలని కంచికచర్ల ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు పిలుపునిచ్చారు. నరసింహారావుపాలెంలోని సహ్యాద్రి ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ గోపాలరావు రూ.5వేల విలువగల వైద్యపరికరాలను స్థానిక వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌కు బుధవారం అందజేశారు.ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ కర్మాగారాలు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. గోపాలరావు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి తమ వంతుగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. సర్పంచ్ బొమ్మిశెట్టి దుర్గాదేవి, ఉప సర్పంచ్ గుంటక మాధవరెడ్డి, కంపెనీ ప్రతినిధులు రామకృష్ణ, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా రూ.5లక్షలు అందజేత



జగ్గయ్యపేట అర్బన్: ఐదోవార్డుకు చెందిన సొంగ వినోద్‌బాబు గృహసారథిగా ఉంటూ ఇటీవల విద్యుత్‌షాక్‌తో మృతి చెందగా, ఆయన కుటుంబానికి వైఎస్సార్ బీమా నగదు రూ.5లక్షలు మంజూరయ్యాయి. ఆన్‌లైన్ బ్యాంకింగ్ సిస్టమ్ ద్వారా వినోద్‌బాబు భార్య సంధ్య బ్యాంకు అకౌంట్‌కు బీమా నగదు రూ.5లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశారు. ఈ సందర్భంగా బీమా మంజూరు పత్రాన్ని మున్సిపల్ వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వార్డు కౌన్సిలర్ వట్టెం మనోహర్ కలిసి మృతుడి కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. బీమా నగదు మంజూరుచేయడంపై మృతుడి కుటుంబసభ్యులు ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో బతుకమ్మ ఉత్సవాలను బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో తయారుచేసిన బతుకమ్మలకు మహిళలు పూజలు చేశారు. కార్యక్రమంలో బతుకమ్మ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు అనంతరాజా, తులసి సుబ్బారావు, యర్రా శ్రీనివాసరావు, నోముల శివకుమార్, చక్కా సుధాకర్, కేతవరపు వెంకట్, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.


జగన్మాతా..నమోస్తుతే



అన్నపూర్ణాదేవిగా జగ్గయ్యపేటలోని శ్రీరేణుకాపరమేశ్వరి అమ్మవారు



పేటలోని వెండి దేవాలయంలో



స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్‌లోని నాగ సత్యమ్మ ఆలయంలో అమ్మవారు



నందిగామలో లలితాదేవి అలంకరణలో మరిడి మహాలక్ష్మి అమ్మవారు



దుర్గానగర్‌లో శాకాంబరి అలంకరణలో



మక్కపేట ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో మహాలక్ష్మిగా దర్శనమిచ్చిన అమ్మవారు



గౌరవరంలో మహాలక్ష్మి అలంకారంలో అమ్మవారు




కంచికచర్ల కన్యాకాపరమేశ్వరి ఆలయంలో మహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు



కంచికచర్లలో దుర్గాదేవి అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



పెనుగంచిప్రోలులో శ్రీమహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు



రామాలయం వద్ద మహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు

జగ్గయ్యపేట అర్బన్ : దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు శ్రీమహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక నకాశిబజారులోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో శ్రీచండీ మూలమంత్రసహిత రుద్ర హోమం నిర్వహించారు. అద్దాలబజారులోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయంలో ఆలయ కమిటీ వారు నిర్వహించిన తులాభారం కార్యక్రమంలో కమిటీ చైర్మన్ అత్తులూరి వెంకటేశ్వర్లు, పుష్పావతి దంపతులు పాల్గొన్నారు. దుర్గాపురంలోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో శ్రీలలితత్రిపుర సుందరీదేవి అలంకరణలో, అద్దాలబజారులోని శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రీగాయత్రీదేవి అలంకరణలో, చెరువుబజారులోని శ్రీరేణుకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రీఅన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల్లో కుంకుమార్చన, చండీ మూలమంత్ర సహిత రుద్రహోమం చేశారు. పట్టణ శివారులోని స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్‌లోని నాగసత్యమ్మ ఆలయంలో అర్చకులు కృష్ణ భరద్వాజ్, సంపత్ జానకీరామ్ అమ్మవారిని వివిధ రకాల కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. కృష్ణమూర్తి, మాధవి దంపతులు, పీఆర్‌కె రాజు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

గౌరవరంలో..

జగ్గయ్యపేట: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన దుర్గాదేవికి భక్తులు పూజలు నిర్వహించారు. అనుమంచిపల్లి, బలుసుపాడు, గౌరవరం గ్రామాల్లో విగ్రహాల వద్ద అర్చకులు విశేష పూజలతోపాటు మహాలక్ష్మీ హోమాలు నిర్వహించారు.

నందిగామలో..

నందిగామ నియోజకవర్గ వ్యాప్తంగా దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నాలుగో రోజైన బుధవారం అమ్మవారు ఆయా ఆలయాల్లో పలురూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని శుక శ్యామలాంబ, కన్యక పరమేశ్వరి అమ్మవార్లు మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. దుర్గానగర్‌లోని అమ్మవారిని పలు రకాల కూరగాయలు, ఆకుకూరలతో అన్నపూర్ణాదేవిగా అలంకరించి విశేష పూజలు చేశారు. అంబారుపేటలో వేంచేసియున్న శ్రీ సత్యమ్మ, పల్లగిరి గట్టుపైగల త్రిశక్తి పీఠంలోని కనకదుర్గ అమ్మవార్లు అన్నపూర్ణాదేవిగా, స్థానిక మరిడి మహాలక్ష్మి అమ్మవారు లలితాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని ఆయా కూడళ్లు , గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవార్లను ప్రత్యేకాలంకరణ చేసి భక్తులు పూజలు చేశారు.

కొనసాగుతున్నబతుకమ్మ సంబరాలు :

మండలంలోని అంబారుపేట, లింగాలపాడు, అడవి రావులపాడు, పెద్దవరం, మాగల్లు, గ్రామాల్లో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. వివిధ రకాల పూలతో మహిళలు బతుకమ్మలను ప్రత్యేకంగా తయారుచేసి ఆడిపాడుతుండటంతో గ్రామాల్లో సందడి నెలకొంది.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: మండలంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగవైభవంగా సాగుతున్నాయి. మహోత్సవాల్లో భాగంగా బుధవారం ఆయా గ్రామాల్లోని ఆలయాలు, ప్రధాన కూడళ్లలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దుర్గమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు ,సామూహిక కుంకుమార్చనలు చేశారు. అల్లూరులో వేంచేసియున్న సీతారామచంద్ర స్వామి సహిత మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్తలు అల్లూరు భాస్కరరావు, అంజనాదేవి దంపతులు అమ్మవారికి విశేష పూజలు చేశారు. జుజ్జూరులో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉత్సవ కమిటీ, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి :దేవీశరన్నవరాత్రులలో భాగంగా బుధవారం అమ్మవారు భక్తులకు మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. వత్సవాయి, దబ్బాకుపల్లి, పోలంపల్లి, కంభంపాడు, లింగాల, చిట్టేల, మక్కపేట, భీమవరం తదితర గ్రామాలలో అమ్మవారు నవరాత్రులను వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా అలంకరించిన మండపాలలో అమ్మవారికి విశేషపూజలు చేస్తున్నారు. సాయంత్రం సమయాల్లో మహిళలు బతుకమ్మలను ఒకచోటకు చేర్చి ఆడిపాడుతున్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: దసరా నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం తూర్పు బజారులో శ్రీదుర్గామల్లేశ్వరి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నవరాత్రుల పందిరిలో శ్రీకనకదుర్గమ్మ అమ్మవారు శ్రీలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు విశేష పూజలు నిర్వహించారు. పడమట బజారు బీసీ కాలనీలో రామాలయం వద్ద ఏర్పాటు చేసిన పందిరిలో అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో ఉత్సవాల్లో భాగంగా కుంకుమార్చన నిర్వహించారు. శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయం. నవాబుపేట, ముండ్లపాడు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల : దేవీ శరన్నవరాత్రులను మండలంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. పట్టణంలోని జుజ్జూరు రోడ్డులో విశ్వశాంతి మిత్రమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారు గజలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. చిన్నారులకు అక్షరభ్యాసం చేశారు. స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. గండేపల్లిలో కాటా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారికి భక్తులు, మాలాధారులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధన చేశారు.

ప్రజలందరికీ ఆరోగ్య భద్రత



కంచలలో మెడికల్ కిట్లు పంపిణీ చేస్తున్న నందిగామ ఎమ్మెల్యే

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



కొణకంచిలో మెడికల్ కిట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ నాగమణి, సర్పంచ్ దేవి, వైద్యులు



కె.అగ్రహారంలో ప్రజలను పరీక్షిస్తున్న వైద్యులు



పేటలో కిట్లను అందజేస్తున్న తుమ్మల ప్రభాకర్, నాయకులు



పేరకలపాడులో వైద్యసిబ్బందితో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గతానికి భిన్నంగా వైద్యసేవలందుతున్నాయని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. మండలంలోని కంచలలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ ప్రజారోగ్యానికి మరింత భద్రత కల్పించేలా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తోందన్నారు. ముఖ్యంగా గతంలో సరైన వైద్య సదుపాయాలు లేకపోవడంతో పేదవాడికి రోగం అంటే చావుతో సమానమని పరిస్థితి ఉండేదన్నారు. నేడు ఏ రోగానికైనా కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్యమందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య ప్రదాతగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. గత ప్రభుత్వాల హయాంలో వైద్యం ఖరీదైన వ్యవహారంగా ఉండగా, నేడు ఇంటిముంగిటకే వైద్యసేవలను తీసుకువచ్చామని వివరించారు. వైద్యపరీక్షల అనంతరం ప్రజలకు మెడికల్‌కిట్లు పంపిణీ చేశారు. ఎంపీపీ అరిగెల సుందరమ్మ, సర్పంచ్ చలమల కవిత, ఎంపీటీసీ సభ్యుడు రామిరెడ్డి సీతయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చలమల మధుసూదనరావు, నెలకుదిటి శివనాగేశ్వరరావు, నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట అర్బన్: అందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలనే ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ పేర్కొన్నారు. పట్టణంలోని 11వ సచివాలయం పరిధిలోని ప్రజల కోసం స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రజల చెంతకే వెళ్లి నాణ్యమైన వైద్యసేవలు అందించే కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాకత్మకంగా నిర్వహిస్తోందని కొనియాడారు. 676మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేసినట్లు కమిషనర్ మల్లేశ్వరరావు తెలిపారు. కౌన్సిలర్ వట్టెం మనోహర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, ఏఈ హనుమంతరావు, వైద్యులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

కొణకంచి(పెనుగంచిప్రోలు):ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి పేర్కొనానరు. కొణకంచి ఎంపీపీ పాఠశాల ఆవరణలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈశిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. అనంతరం పరీక్షలు చేయించుకున్న రోగులకు మెడికల్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో గోనెల దేవి, వైస్ ఎంపీపీ కనగాల శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీభార్గవి, సచివాలయాల మండల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, వైఎస్సార్‌సీపీ నాయకులు దేరంగుల శ్రీనివాసరావు, బొమ్మి రాణి, బెజవాడ శ్రీనివాసరావు, వైద్యులు సుజన, వాసంతి, కె.వాణి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

వత్సవాయి మండలంలో..

పోలంపల్లి(వత్సవాయి) : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తోందని వత్సవాయి మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు కాటేపల్లి రవిరామలక్ష్మి తెలిపారు. మండలంలోని పోలంపల్లిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యపరీక్షల అనంతరం మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ మాదుగుల లాజర్, సొసైటీ అధ్యక్షులు కాటేపల్లి రవి, వైద్యాధికారిణి సుష్మాప్రియదర్శిని, పంచాయతీ కార్యదర్శి రంగారావు, వీఆర్వో గురవయ్య పాల్గొన్నారు.

జగ్గయ్యపేట మండలంలో..

కె.అగ్రహారం(జగ్గయ్యపేట): జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులలో మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నట్లు ఈవోపీఆర్డీ సాంబశివరావు తెలిపారు. మండలంలోని కె.అగ్రహారంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 500 మందికి వైద్య సేవలందించి మందులు పంపిణీ చేశారు. సర్పంచ్, ఉపసర్పంచ్‌లు ఆవుల శ్రీనివాసరావు, ముల్లగిరి కుమారి, విద్యా కమిటీ చైర్మన్ వాణి, కార్యదర్శి నరసింహారావు, వైద్యాధికారులు అనిల్‌కుమార్, స్రవంతి, కీర్తిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ఐదుమళ్ల నాగేశ్వరరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాసరావు, వీరబాబు, ముప్పా నాగయ్య, వైద్యారోగ్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్‌లు పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో..

పేరకలపాడు(కంచికచర్ల) : గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నివసించే పేదలందరికీ నాణ్యమైన ఆరోగ్యసేవలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి రూపకల్పన చేశారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. మండలంలోని పేరకలపాడు ఎంపీయూపీ స్కూల్‌లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని గ్రామాల్లో అందించడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. ప్రజారోగ్యం విషయంలో మన రాష్ట్రం దేశంలోనే ముందజలో ఉందన్నారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం ద్వారా ప్రతిఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మునగఆకుతో తయారు చేసిన పోషకాహార స్టాళ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. జడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, ఎంపీటీసీ సభ్యులు పాపట్ల సీత, సొసైటీ అధ్యక్షుడు వేమవరపు పురుషోత్తం, నాయకులు కందుల అశోక్, మర్రి వరప్రసాద్, డీఎల్‌పీవో బొజ్జగాని శ్రీనివాసరావు, వైద్యులు డాక్టర్ కె.మధురిమ, జెస్సీ లివింగ్ ఫెయిత్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హుస్సేన్‌బీ, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, సచివాయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



తోటరావులపాడులో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చందర్లపాడు(నందిగామటౌన్): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి చరిత్ర ఎరుగని రీతిలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు కొనియాడారు. చందర్లపాడు మండలం తోటరావులపాడులో బుధవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి పథకాల అమలు తేదీలతో కూడిన క్యాలెండర్‌ను ప్రజలకు అందజేశారు. ఈసందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న మంచి పనులను ప్రజల్లోకి పూర్తిస్థాయిలో వివరించడంతోపాటు ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా తెలుసుకునేందుకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. సర్పంచ్ ములకలపల్లి లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ములకలపల్లి కృష్ణమోహన్, వైఎస్‌ఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల అపూర్వ కలయిక



సమ్మేళనానికి హాజరైన ఎస్‌జీఎస్ కళాశాల 1986-89 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

జగ్గయ్యపేట అర్బన్: నేటి యాంత్రిక జీవనంలో రోజురోజుకు క్షీణిస్తున్న మానవ సంబంధాల నేపథ్యంలో 34ఏళ్ల తరువాత పూర్వ విద్యార్థులు కలుసుకొని తమ గురువులను గౌరవించడం సంతోషదాయకమని విశ్రాంత అధ్యాపకులు కె.సత్యనారాయణ, ఓంకార్, శశిధర్, విజయలక్ష్మి కొనియాడారు.స్థానిక శ్రీమతి గెంటేల శకుంతలమ్మ(ఎస్‌జీఎస్) కళాశాల వేదికగా 1986–89బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా విశ్రాంత అధ్యాపకులను పూర్వవిద్యార్థులు ఘనంగా సత్కరించారు. పూర్వవిద్యార్థులు కట్టా శ్రీనివాసరావు, ఉషారాణి, బచ్చలకూర పుష్పరాజ్, యానాల గోపిచంద్, ప్రేమ్‌చంద్ పాల్గొన్నారు.